
సాక్షి
వైఎస్సార్ జిల్లా

శుక్రవారం । 6 । జూన్ । 2025



త్యాగమయ జీవితం.. బక్రీద్ సందేశం
అల్లాహ్ ప్రసాదించిన ఈ జీవితాన్ని త్యాగం చేసేందుకు వెనుకాడకూడదని సందేశాన్ని చ్చేదే బక్రీద్. ఈ పండుగను శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోనున్నారు. -10లో



రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలి మృతి
చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలేటిపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలు రాణికుమారి మృతి చెందారు. -10లో

గరిష్టం/కనిష్టం
37.2/27.6

వాతావరణం
జిల్లాలో గురువారం 27.6 - 37.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 6.0 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

ఖాకీ క్రౌర్యం.. పోయిన ప్రాణం



- పేకాట వ్యవహారంలో నారాయణరెడ్డిపై గంజాయి కేసు
- డబ్బుల ఇవ్వక పోవడంతోనే నమోదు
- బెయిల్‌పై వచ్చినా.. ఇబ్బంది పెట్టిన వైనం
- ఆత్మహత్య చేసుకున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త



రెడ్యం నారాయణరెడ్డి (ఫైల్)

ఖాజీపేట: పోలీసులు పెట్టిన తప్పుడు కేసు, ఆపై వేధింపులు.. ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకున్నాయి. ఒక కుటుంబాన్ని వీధిన పడేలా చేశాయి. ఇద్దరు చిన్నారులను తండ్రిని కోల్పోయిన వారిగా మార్చాయి. పేకాట కేసులో తీసుకొచ్చిన వారిపై ఖాజీపేట పోలీసులు కేసులు నమోదు చేయకుండా.. డబ్బులు బేరసారాలు చేయడం, కుదరక పోవడంతో గంజాయి కేసు నమోదు చేశారు. ఈ సంఘటన దుంపలగట్టు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రెడ్యం శివ లక్ష్మీనారాయణరెడ్డి ఆత్మహత్యకు కారణమైంది. బాధితులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.

చెన్నూరు చెక్కర ఫ్యాక్టరీ సమీపంలో మే 6న పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే దాడులు చేయడానికి వారు వెళ్లారు. అక్కడ ఎవరూ లేకపోవడంతో.. అక్కడికి వెళ్తున్న ముగ్గురు వ్యక్తులను గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారణ చేశారు. సుమారు 12 మంది పేకాట ఆడేందుకు వస్తున్నట్లు అనుమానించారు. అందులో దుర్గం ఖాదర్ బాషా, సిద్దంగారి గురుమహేశ్వర్‌రెడ్డి, రెడ్యం శివలక్ష్మీనారాణరెడ్డి, మాచుపల్లి గుర్రప్ప, ఇరగంరెడ్డి భరత్‌రెడ్డి, నాగూర్ బాషా, కమాల్‌బాషా, లక్ష్మీరెడ్డి, నాగేంద్రరెడ్డి, ఫరూక్, కుమార్‌రెడ్డి, లోకేష్‌రెడ్డిలు పేకాట ఆడేందుకు వెళ్తున్నట్లు అనుమానించారు. వారిని మే 6న ఖాజీపేట పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారణ చేశారు. అయితే పేకాట ఆడలేదని వారిలో కొందరు చెప్పారు. దీంతో అప్పుడు కేసు నమోదు చేయకుండా పంపించారు. అనంతరం 7, 8వ తేదీల్లో పిలిపించారు. వారిలో కొందరిని డబ్బులు డిమాండ్ చేశారని బాధితులు తెలిపారు. ఇవ్వక పోవడంతో 9న పేకాటతోపాటు గంజాయి తీసుకొచ్చి అమ్ముతున్నట్లు 12 మందిపై కేసు నమోదు చేశారు. 2.570 గ్రాముల గంజాయి పట్టుకున్నట్లు, రూ 20,500 నగదు, 52 పేక ముక్కలు దొరికినట్లు కేసు కట్టారు. అందులో 9 మందిని అరెస్ట్ చేసి కోర్టుకు పంపించారు. ముగ్గురు వ్యక్తులు తప్పించుకున్నట్లు కేసులో కనపరిచారు.



లక్ష్మీనారాయణరెడ్డి మృతదేహం వద్ద కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా నేతలు

రెడ్యం శివలక్ష్మీనారాయణరెడ్డి ఆత్మహత్య

ఈ కేసులో ఎలాంటి సంబంధం లేని రెడ్యం శివలక్ష్మీనారాయణరెడ్డిని నిందితునిగా చేర్చి, అతనిపై గంజాయి కేసు నమోదు చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మే 9న అరెస్టయిన అతను మే 29న కండీషన్ బెయిల్‌పై బయటికి వచ్చాడు. వచ్చిన తరువాత కూడా తనను పోలీసులు చేసిన చిత్రహింసలకు గురి చేస్తున్నారని కుటుంబ సభ్యులకు వివరించాడు. దెబ్బలను తన భార్య సుభాషిణికి చూపించాడు. తనకు ఎలాంటి సంబంధం లేని కేసులో ఇరికించారని భార్య వద్ద తీవ్ర మనోవేదన వ్యక్తం చేశాడు. దీనికి తోడు కండీషనల్ బెయిల్‌పై రావడంతో.. ప్రతి వారంలో రెండు సార్లు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేసి పోవాల్సి వచ్చింది. సంతకాలకు వెళ్లినప్పుడల్లా డబ్బుల కోసం వేధిస్తున్నట్లు భార్య దగ్గర వాపోయాడు. దీంతో తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడు.

విద్యుత్ తీగలు పట్టుకుని..

బుధవారం రాత్రి ఇంటిలో నుంచి బయటికి వెళ్లిన నారాయణరెడ్డి పుష్పగిరికి వెళ్లే రహదారిలోని ట్రాన్స్‌ఫార్మర్ వైరు పట్టుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అక్కడ చూసిన వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో.. అప్పటికే వెతుకుతున్న కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూసే సరికి మృతి చెంది ఉన్నాడు. అయినా వెంటనే చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

సీఐపై మృతుడి భార్య ఫిర్యాదు

తన భర్త నారాయణరెడ్డి మృతికి ఖాజీపేట సీఐ మోహన్ వేధింపులే కారణం అని రెడ్యం సుభాషిణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. 6న రోడ్డుపై పూలు అమ్ముకుంటున్న తమ వద్దకు పోలీసులు వచ్చి తన భర్త గురించి అడిగారని చెప్పింది. స్టేషన్ వద్దకు వెళ్తే తన భర్తను విచక్షణా రహితంగా, దారుణంగా కొట్టారని తెలిపింది. తమ వద్ద లక్ష డబ్బు డిమాండ్ చేశారని పేర్కొంది. అలాగే బెయిల్‌పై వచ్చిన తరువాత సంతకాలకు వెళ్లినప్పుడు డబ్బులు డిమాండ్ చేశారని వాపోయింది. ఇలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తన భర్త చావుకు కారణమైన సీఐని శిక్షించాలని మైదుకూరు అర్బన్ సీఐకి ఫిర్యాదు చేసింది.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

కడప అర్బన్: దుంపలగట్టుకు చెందిన రెడ్యెం శివలక్ష్మీనారాయణరెడ్డి గత ఎన్నికలలో వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చాడని.. తెలుగుదేశం పార్టీ నాయకుల ఒత్తిడితో పోలీసులు అక్రమ కేసు నమోదు చేసి వేధించడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజాద్‌బాషా అన్నారు. రిమ్స్ మార్చురీలో శివలక్ష్మీనారాయణరెడ్డి మృతదేహాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మృతుడి భార్య సుహాసిని, పిల్లలు, బంధువులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సంఘటనను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని తెలియజేశారు. బాధిత కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున అండగా ఉంటామన్నారు. బాధ్యులైన వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట పలువురు వైఎస్ ఆర్‌సీపీ నేతలు ఉన్నారు.

నా భర్త మృతికి బాధ్యత ఎవరిది?

'నా భర్త నారాయణరెడ్డి పోలీసుల వేధింపులతోనే చనిపోయాడు. మా కుటుంబానికి దిక్కు లేకుండా చేశారు. ఇద్దరు బిడ్డల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. మాకు ఉన్న పెద్ద దిక్కు లేకుండా చేశారు. ఇందుకు కారణం పోలీసులే.. ఇప్పుడు నా భర్త మృతికి బాధ్యత ఎవరు తీసుకుంటారు. నాకు న్యాయం చేయాలి' అని నారాయణరెడ్డి భార్య గుండెలవిసేలా రోదించింది. ఆమె ఆవేదన అక్కడి వారిని కంటతడి పెట్టించింది.

ప్రజలే తిరగబడే రోజులొస్తున్నాయి

- లక్ష్మీనారాయణరెడ్డిని హింసించిన సీఐపై కేసు నమోదు చేయాలి
- లేనిపక్షంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు
- మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి హెచ్చరిక
- పార్టీ నేతలతో కలిసి ఎస్పీకి వినతిపత్రం

కడప కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగాన్ని ఇలాగే కొనసాగిస్తూ పోతే.. ప్రజలు ఎదురుదాడి చేసే పరిస్థితులు ఉత్పన్నమవుతాయని మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి హెచ్చరించారు. గురువారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా, ఆర్టీసీ జోనల్ మాజీ చైర్మన్ రెడ్యం వెంకట సుబ్బారెడ్డితో కలిసి జిల్లా ఎస్పీ జీవీజీ అశోక్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే నెల ఆరో తేదీన పేకాట ఆడుతున్నారని 12 మందిపై ఖాజీపేట పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, అందులో వైఎస్సార్‌సీపీ కార్యకర్త రెడ్యం లక్ష్మీనారాయణరెడ్డిని ఏ8గా చేర్చారన్నారు. రెడ్‌హ్యాండెడ్‌గా పోలీసులు పట్టుకోలేదని, పోలీస్‌స్టేషన్‌కు పిలిపిస్తే వారు వెళ్లారన్నారు. మూడు రోజులపాటు స్టేషన్‌లో చితక్కొట్టి 9వ తేదీన గంజాయి కేసు పెట్టి అరెస్ట్ చేశారన్నారు. ఇటీవల అతను జైలు నుంచి విడుదలై వచ్చి నిన్న(మంగళవారం) వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమంలో కూడా పాల్గొన్నాడన్నారు. లక్ష్మీనారాయణరెడ్డి చాలా సున్నిత మనస్కుడని, అతనికి ఇది వరకు నేరచరిత్ర లేదన్నారు. పోలీసులు అసత్య సమాచారంతో తప్పుడు కేసు నమోదు చేసి చిత్రహింసలకు గురిచేశారన్నారు. ఇలా హింసించే హక్కు పోలీసులకు ఎవరిచ్చారని, ఎవరి వత్తాసుతో ఇలా చేస్తున్నారని మండిపడ్డారు. తమ చేతగాక అవినీతి పోలీసులను అడ్డుపెట్టుకొని వేధిస్తున్నారని, వారిపై ప్రైవేటు కంప్లెయింట్ ఇచ్చామన్నారు. లక్ష్మీనారాయణరెడ్డి మృతదేహంతో పోలీస్‌స్టేషన్ వద్దే ఆందోళన నిర్వహించాలని అనుకున్నామని, జిల్లా ఎస్పీ కేసు నమోదు చేసి విచారణ చేస్తామని హామీ ఇవ్వడంతో విరమించుకున్నామని తెలిపారు.



మార్చురీలో లక్ష్మీనారాయణరెడ్డి మృతదేహం వద్ద మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

పోలీసులు లక్షల రూపాయలు డిమాండ్ చేశారు : అంజద్‌బాషా

లక్షల రూపాయలు ఇవ్వాలని లక్ష్మీనారాయణరెడ్డిపై ఖాజీపేట పోలీసులు ఒత్తిడి చేశారని, అతన్ని తీవ్రంగా కొట్టి చిత్రహింసలకు గురి చేశారని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ఆరోపించారు. ప్రజల బాగోగుల గురించి ఈ ప్రభుత్వం పట్టించుకోలేదని, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతూ వారిని అవమానిస్తోందన్నారు. రోడ్డుపై పూలు అమ్ముకునే వ్యక్తిని లక్షల రూపాయలు డిమాండ్ చేశారన్నారు. బెయిల్ వచ్చిన తర్వాత కూడా డబ్బుల కోసం తీవ్రంగా వేధించారన్నారు. వారి వేధింపులు భరించలేకే ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. సీఐపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు న్యాయం చేయకపోతే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

అవమానం జరిగాక బతికి ఉపయోగం లేదనే ఆత్మహత్య : రెడ్యం


పోలీసులు గంజాయి కేసు పెట్టడంపై లక్ష్మీనారాయణరెడ్డి తీవ్ర అవమానంగా భావించాడని, ఇంత అవమానం జరిగిన తర్వాత బతికి లాభం లేదనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆర్టీసీ జోనల్ మాజీ చైర్మన్ రెడ్యం వెంకట సుబ్బారెడ్డి అన్నారు. పోలీసులు అతన్ని పదే పదే స్టేషన్‌కు పిలిపించి కొట్టారని, పిలిపించిన ప్రతి సారీ డబ్బు రాబట్టారన్నారు. జైల్లో కూడా తీవ్ర అవమానాలకు గురయ్యాడన్నారు. మృతుడికి ఆరో తరగతి చదివే పిల్లలు ఉన్నారని, వారికి ఇప్పుడు భద్రత, రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ పులి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

12న షర్మిల రాక

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాకు ఈ నెల 12న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల వస్తున్నట్లు డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి పేర్కొన్నారు. నగరంలోని ఇందిరాభవన్‌లో పార్టీ కోఆర్డినేటర్లు, డీసీసీ కమిటీ సభ్యులు, మండల ప్రెసిడెంట్లు, మైనారిటీ నాయకులతో ఆమె గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కడపలోని ఐఎంఏ హాల్‌లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 వరకు సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ పదవులు పొందిన నాయకులతో వ్యక్తిగతంగా షర్మిల క్షేత్ర, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో పార్టీ బలోపేతంపై చర్చిస్తారని చెప్పారు. కష్టపడి పని చేసే నాయకులకు పార్టీ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పార్టీకి వ్యతిరేకంగా పని చేసే వారిని కార్యాలయంలోకి కూడా అనుమతించరన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వన మహోత్సవానికి శ్రీకారం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సి.శ్రీధర్

కడప ఎడ్యుకేషన్: 'హరిత ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో భాగంగా ఈ నెల 5 నుంచి కార్తీక మాసం వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వన మహోత్సవాన్ని యోగివేమన యూనివర్సిటీ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి గురువారం ప్రారంభించారు. జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్, గౌరవ అతిథులుగా డీఎఫ్ఓ వినీత్ కుమార్ (టెరిటోరియల్), డీఎఫ్ఓ (సామాజిక వన్య అటవీ సంరక్షణ), కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, వైవీయూ రిజిస్ట్రార్ పుత్తా పద్మ, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, డీపీవో రాజ్యలక్ష్మి హాజరై అడవి జాతి మొక్కలు నాటి 'హరితాంధ్ర ప్రదేశ్' లక్ష్య సాధనకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వన మహోత్సవం గురించి వివరించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో విశిష్టమైన సేవలు అందించిన మధుసూదన్‌రెడ్డి, (బోటనీ ప్రొఫెసర్), అంకాల్, మునెయ్య, ద్వారకా నాథరెడ్డి, లక్ష్మీరెడ్డిలు సమాజ హితం కోసం చేసిన సేవలను ప్రశంసిస్తూ వారికి అవార్డులను బహుకరించారు. ఈ కార్యక్రమంలో యోగి వేమన యూనివర్సిటీ, అటవీశాఖ, డ్వామా, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన ఫలితాలు సమర్థంగా ఉండాలి

డీఈఓ షేక్ షంషుద్దీన్


కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వం నూతనంగా రూపొందించిన అకాడమిక్ క్యాలెండర్ కరికులం ఇంటిగ్రేషన్‌కు అనుగుణంగా అభ్యసన ఫలితాలు సమర్థవంతంగా ఉండేటట్లు శిక్షణ అందించాలని డీఈఓ షేక్ షంషుద్దీన్ పేర్కొన్నారు. గురువారం కడప జయనగర్‌కాలనీ బాలికల ఉన్నత పాఠశాలలో డిస్ట్రిక్ రిసోర్సు పర్సన్‌లకు నిర్వహిస్తున్న శిక్షణ గురువారం ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీఈఓ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన రీసోర్స్ పర్సన్‌లు ఈ నెల 9, 10, 11 తేదీలలో డివిజన్ స్థాయిలో పాల్గొనే ఉపాధ్యాయులకు తెలియజేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర పరిశీలకులు ఎస్సీఈఆర్టీ ప్రొఫెసర్ బ్రహ్మనందరెడ్డి, డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్ బాబు, కడప డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, డైట్ అధ్యాపకులు గిరిబాబు, రెడ్డెయ్య పాల్గొని పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో స్టేట్ రీసోర్సు పర్సన్స్ గంగాధర్, సుబ్బానాయుడు, నిత్యానందరెడ్డి, వెంకటేశ్వర్లు, గంగాధర్ నాయుడు, సిద్దు, కరీముల్లా, అల్తాఫ్, జయన్న, జోసెస్, సంజీవరెడ్డి, తిరుమలకొండ, సురేష్‌కుమార్‌రెడ్డి, కృష్ణానాయక్, బాబాసాహేబ్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీకి సర్వం సిద్ధం

- నేటి నుంచి ప్రారంభం కానున్న ఆన్‌లైన్ పరీక్ష
- జిల్లా వ్యాప్తంగా ఈ నెల 6 నుంచి 30 వరకు..
- 705 పోస్టులకు 43575 మంది దరఖాస్తు
- అన్ని ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ అధికారులు



ఆన్‌లైన్ పరీక్ష కోసం సిద్ధం చేసిన కంప్యూటర్లు



కడప ఎడ్యుకేషన్: డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ సర్వం సిద్ధం చేసింది. శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న ఈ పరీక్షలు ఈ నెల 30 వరకు కొనసాగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 43575 మంది అభ్యర్థులు రాయనున్నారు. రెండు విడతల్లో పరీక్ష నిర్వహణ ఉంటుంది. ఉదయం సెషన్ 9.30 నుంచి 12 వరకు మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తారు. మధ్యలో ఒక రోజు ఇంగ్లిష్ ప్రొఫిసెన్సీ టెట్ నిర్వహించనున్నారు. ఈ పరీక్ష కూడా రెండు విడతల్లో ఉంటుంది. ఉదయం 11 నుంచి 12.30 వరకు మధ్యాహ్న 4 నుంచి 5.30 గంటల వరకు నిర్వహిస్తారు.

జిల్లాలో ఖాళీ పోస్టుల వివరాలు				
సబ్జెక్టు	ప్రభుత్వ, జెడ్పీ	మున్సిపల్	కార్పొరేషన్	మొత్తం
ఎస్‌ఏ సంస్కృతం	–	–	1	1
ఎస్‌ఏ తెలుగు	26	–	–	26
ఎస్‌ఏ ఉర్దూ	6	–	1	7
ఎస్‌ఏ హిందీ	16	1	1	18
ఎస్‌ఏ ఇంగ్లిషు	78	1	2	81
ఎస్‌ఏ మ్యాథ్స్(టీఎం)	42	–	1	43
ఎస్‌ఏ మ్యాథ్స్(యూఎం)	–	1	–	1
ఎస్‌ఏ పీఎస్(టీఎం)	28	–	–	28
ఎస్‌ఏ పీఎస్(యూఎం)	2	–	1	3
ఎస్‌ఏ బీఎస్(టీఎం)	49	2	–	51
ఎస్‌ఏ బీఎస్(యూఎం)	2	–	–	2
ఎస్‌ఏ ఎస్ఎస్(టీఎం)	58	1	1	60
ఎస్‌ఏ ఎస్ఎస్(యూఎం)	5	–	–	1
ఎస్‌ఏ పీఈ	77	1	4	82
ఎస్‌జీటీ (టీఎం)	219	21	12	252
ఎస్‌జీటీ(యూఎం)	31	7	7	45
మొత్తం	639	35	31	705

జిల్లా వ్యాప్తంగా 9 పరీక్షా కేంద్రాల్లో..

డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షకు జిల్లాలో 9 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు. కడపలో ఆరు, ప్రొద్దుటూరులో మూడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కడపలోని కేఎస్‌ఆర్ఎం, కేఓఆర్ఎం, కేఎల్ఎం, శ్రీనివాస, స్విస్ట్, అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలల్లో నిర్వహిస్తారు. వీటిలో 30,586 మంది అభ్యర్థులు రాయనున్నారు. ప్రొద్దుటూరులోని సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, వాగ్దేవి, సీబీఐటి ఇంజినీరింగ్ కళాశాలల్లో ఏర్పాటు చేశారు. ఇక్కడ 12989 మంది అభ్యర్థులు రాయనున్నారు.

పర్యవేక్షణ: పరీక్ష పర్యవేక్షణకు ప్రతి కేంద్రంలో ఒక డిప్యూటీ కలెక్టర్, ఒక డిపార్ట్‌మెంట్ అధికారి, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ నియమించినట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. వీరితోపాటు కడపకు కడప డివిజన్ డిప్యూటీ డీఈ రాజగోపాల్‌రెడ్డి, ప్రొద్దుటూరుకు ప్రొద్దుటూరు డిప్యూటీ ఈఓ మీనాక్షిని నియమించినట్లు పేర్కొన్నారు.

గంట ముందే చేరుకోవాలి



నిర్ణీత సమయం కంటే గంట ముందే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. ఒరిజినల్ హాల్ టికెట్‌తోపాటు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు వెంట తీసుకుని రావాలి. ఎలాంటి ఎల్రక్టానిక్స్ వస్తువులను అనుమతించరు.
– షేక్ షంషుద్దీన్, జిల్లా విద్యాశాఖ అధికారి

ప్రభుత్వంపై పెల్లుబికిన ప్రజాగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

- 'వెన్నుపోటు దినం' విజయవంతం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంపై ప్రజాగ్రహం పెల్లుబికుతోందని, నిన్న తమ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమాలు విజయవంతమై ఈ విషయం స్పష్టమైందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమం విజయవంతమైందన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు బాధ, నిరాశ, నిస్పృహలతో ఉన్నారని, వారి ఆగ్రహం ఈ విధంగా వ్యక్తమైందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేష్, బీజేపీ నేతలు ఏ హామీలు ఇచ్చారో మర్చిపోయారని, ప్రజలు మాత్రం వాటిని బాగా గుర్తుంచుకున్నారన్నారు. రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి రూ.1.56 లక్షల కోట్లు అప్పు చేశారని, ఈ నిధులను దేనికి ఖర్చుపెట్టారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కూడా అప్పులు చేసిందని, ఆ నిధులను డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా ప్రజల ఖాతాలకు నేరుగా చేరవేయడం జరిగిందన్నారు. తల్లులు, నిరుద్యోగులు, విద్యార్థులు, మహిళలు, రైతులకు ఈ ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందన్నారు. ఆ హామీలను వడ్డీతో సహా చెల్లించాలని ప్రజలు అడుగుతున్నారన్నారు.

రెడ్ బుక్ రాజ్యాంగం అమలు

అబ్బా కొడుకులు తమ డబ్బా కొట్టుకోవడానికే ఏడాది కాలం గడిచిపోయిందన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగంపై మక్కువతో పాలనను గాలికొదిలేశారన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ అన్న విధంగా తయారైందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు జీవితమే వెన్నుపోట్లతో మొదలైందన్నారు. ఎన్‌టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి టీడీపీని కైవసం చేసుకున్నారన్నారు. కడపలో మహానాడు నిర్వహించి కడప మా అడ్డా అంటూ డబ్బా కొట్టుకున్నారని, నేడు వెన్నుపోటు దినం విజయవంతంతో రాష్ట్రమంతా వైఎస్సార్‌సీపీ అడ్డా అని రుజువైందన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రజాగ్రహాన్ని అణిచివేయాలని చూసిన ప్రభుత్వానికి చుక్కెదురు అయ్యిందన్నారు. చంద్రబాబు, లోకేష్‌లకు దమ్ముంటే ఏడాది పాలనపై సంబరాలకు పిలుపు ఇవ్వాలని సవాల్ విసిరారు. ఇచ్చిన హామీలను వడ్డీతో సహా చెల్లించే వరకూ తాము ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాకా సురేష్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు పులి సునీల్, పి.జయచంద్రారెడ్డి, జి.శ్రీనివాసులరెడ్డి, సీహెచ్ వినోద్, షేక్ షఫీ, మునిశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆకతాయిని పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు

చాపాడు : మండల పరిధిలోని ద్వారకానగరం వద్ద గత కొన్ని రోజులుగా మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ముషారఫ్ అనే వ్యక్తిని గురువారం గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దువ్వూరుకు చెందిన ముషారఫ్ బైక్‌పై ద్వారకానగరం వద్దకు వచ్చి రోడ్డుపై ఒంటరిగా వెళ్లే మహిళల వద్దకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించి పరారయ్యేవాడు. ఈ క్రమంలో గురువారం కొంత మంది మహిళలు కాపుకాచి ఆకతాయి ముషారఫ్‌ను పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు పట్టించారు. పట్టుబడిన వ్యక్తికి కౌన్సెలింగ్ చేసి బైండోవర్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నిప్పు రవ్వలు పడ్డాయని ప్రశ్నించినందుకు దాడి

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి మృత్యుంజయకుంట వద్ద వివాహ వేడుక ఊరేగింపు కార్యక్రమంలో దారిన వెళుతున్న ఓ యువకుడిని ఆకతాయిలు చితకబాదారు. వివాహ వేడుక ఊరేగింపులో ఆకతాయిలు టపాసులను పేల్చుతున్నారు. ఆ సమయంలో అన్నాచెల్లెలు అదే ఊరేగింపు మార్గం మీదుగా ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. టపాసుల నిప్పురవ్వలు తమపై పడటంతో ఉలిక్కిపడిన వారు ఆకతాయిలను ప్రశ్నించారు. దీంతో రెచ్చిపోయిన ఆకతాయిలు యువకుడిని చితకబాది తీవ్రగాయాలపాలు చేశారు. బాధితుడిని రిమ్స్‌కు తరలించారు. సమాచారం అందుకున్న వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులకు ఆకతాయిలు కనిపించలేదు. ఈ సంఘటనపై పోలీసులు సమగ్రంగా విచారిస్తున్నారు.

ఆటో డ్రైవర్‌పై దాడి

మదనపల్లె రూరల్ : ఆటో డ్రైవర్‌పై నలుగురు వ్యక్తులు దాడి చేసిన సంఘటన గురువారం మదనపల్లెలో జరిగింది. మండలంలోని పోతబోలు పంచాయతీ గాండ్లపల్లికు చెందిన మహేష్(33) ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం పట్టణంలోని చిత్తూర్ బస్టాండ్ నుంచి ఆటోలో ఆర్టీసీ బస్టాండ్ వైపు వెళుతుండగా, మార్గమధ్యంలోని సీటీఎం రోడ్డులో ప్రమాదవశాత్తు మరో ద్విచక్ర వాహనాన్ని స్వల్పంగా ఢీకొన్నాడు. ఆటో ఆపి ద్విచక్ర వాహనదారులతో మాట్లాడే ప్రయత్నం చేస్తుండగానే, ద్విచక్ర వాహనం లోని ఇద్దరు వ్యక్తులతో పాటు మరో వాహనంలోని ఇద్దరు వ్యక్తులు కలిసి మహేష్ పై దాడి చేసి తీవ్రంగా కొట్టారు. స్థానికుల సాయంతో మహేష్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి చేరుకుని చికిత్స పొందాడు. దాడి ఘటనపై టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

జీపు- ఆటో ఢీకొని ఇరువురికి తీవ్ర గాయాలు

లక్కిరెడ్డిపల్లి : రాయచోటి-వేంపల్లి మార్గమధ్యంలోని నెహ్రూ నగర్‌కు వెళ్లే సమీపంలో గురువారం ఆటో-జీపు ఢీ కొన్న సంఘటనలో జీపులో ప్రయాణిస్తున్న డ్రైవర్‌తోపాటు మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఆంజనేయులుతోపాటు జీప్ డ్రైవర్ బాబా అనే వ్యక్తిని 108 ద్వారా లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యంకోసం రాయచోటి ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ మేరకు లక్కిరెడ్డిపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలి మృతి

రాయచోటి డిప్యూటీ డీఈఎంఓ దేవశిరోమణికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జుగా మారిన కారు



ప్రమాదంలో మృతి చెందిన రాణికుమారి





గాయపడిన కారు డ్రైవర్ పెంచలబాబు, డిప్యూటీ డీఎంఈఓ దేవ శిరోమణి



ప్రమాద స్థలంలో లభించిన బంగారు ఆభరణాలు

చింతకొమ్మదిన్నె : చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలేటిపల్లె సమీపంలో జాతీయ రహదారిపై గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు రాణి కుమారి (52) మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీ39 ఏజెడ్ 2259 నెంబర్ గల స్విఫ్ట్ డిజైర్ కారు రాయచోటి వైపు నుంచి కడపకు వస్తుండగా ముందు వెళుతున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొంది. ఇదే సమయంలో రాయచోటి వైపు నుంచి వస్తున్న ఏపీ 39 క్యూవీ 0525 నెంబర్ గల కారు వేగాన్ని అదుపుచేయలేక స్విఫ్ట్ డిజైర్ కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో స్విఫ్ట్ కారులో స్వయంగా వాహనాన్ని నడుపుతున్న కడప రాఘవేంద్ర టౌన్‌షిప్‌లో నివాసం ఉంటూ రామాపురం మండలం సరస్వతిపల్లె ఎంపీపీ స్కూలు ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్న రాణికుమారి అక్కడికక్కడే మృతి చెందారు. రాయచోటి వైపు నుంచి వస్తుండిన మరో కారులో ప్రయాణిస్తున్న రాయచోటి డిప్యూటీ డీఈఎంఓ అధికారి దేవశిరోమణితోపాటు కారు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని అంబులెన్స్ ద్వారా రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కాగా ప్రభుత్వ ఉపాధ్యాయురాలైన రాణికుమారికి భర్త పుల్లయ్య, ఇరువురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తెలు విదేశాల్లో ఉన్నట్లు సమాచారం. రాణి కుమారి కారులో నుంచి హైవే పెట్రోలింగ్ కానిస్టేబుల్ నరసింహులు బ్యాగులను స్వాధీనం చేసుకుని అందులోని సుమారు 50 తులాలకుపైగా బంగారు ఆభరణాలతో కూడిన రెండు బ్యాగులను చింతకొమ్మదిన్నె పోలీసులకు ఇచ్చారు. వారు వాటిని సంఘటన ప్రాంతంలోనే మృతురాలి బంధువులకు అప్పగించారు. గాయపడిన దేవశిరోమణి కడప నగరంలోని రాజారెడ్డి వీధి నివాసురాలు, ఈమె కారు డ్రైవర్ పెంచల బాబు కూడా కడపలోనే ఉంటున్నారు. ఈ ప్రమాదంలో రెండు కార్లలోని ఎయిర్ బెలూన్లు తెరుచుకోక పోవడం గమనార్హం. ఈ రోడ్డు ప్రమాదంపై చింతకొమ్మదిన్నె పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లారీ ఢీకొని వీఆర్ఓ దుర్మరణం





ఈశ్వరయ్య మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఈశ్వరయ్య(ఫైల్)

కమలాపురం : కడప-తాడిపత్రి ప్రధాన రహదారిలో రామచంద్రాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కమలాపురం మండలానికి చెందిన వీఆర్ఓ ఈశ్వరయ్య (59) మృతి చెందారు. టి.చదిపిరాళ్లకు ఇన్‌చార్జి వీఆర్ఓగా పని చేస్తున్న ఈశ్వరయ్య గురువారం జంగంపల్లెలో రేషన్ సరుకులు పంపిణీ చేసేందుకు డీలర్ సతీష్ అలియాస్ నానిని తన బైక్‌లో ఎక్కించుకుని చదిపిరాళ్ల నుంచి బయలుదేరారు. మార్గ మధ్యంలో రామచంద్రాపురం వద్దకు రాగానే కడప నుంచి ఎర్రగుంట్ల వైపు వెళ్తున్న లారీ ఈశ్వరయ్య బైక్‌ను ఢీ కొంది. ఈ ఘటనలో ఈశ్వరయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెనుక ఉన్న నాని ఎగిరి పడటంతో కాలు విరిగింది. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం కమలాపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే ఈశ్వరయ్య మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా మృతునికి భార్య, వివాహిత కుమార్తె ఉన్నారు. ఈశ్వరయ్య అందరితో కలివిడిగా ఉండటంతో ప్రజలు ఆసుపత్రికి తండోపతండాలుగా చేరుకున్నారు. ఈశ్వరయ్య మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వ ఒత్తిడి, టార్గెట్ల కారణంగానే ఈశ్వరయ్య మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

ఇది ప్రభుత్వ హత్యే..

వీఆర్ఓ ఈశ్వరయ్యది ప్రభుత్వ హత్యే అని ప్రభుత్వ మాజీ ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ ప్రచార ఆర్భాటాల కోసమే క్షేత్ర స్థాయి సిబ్బందిపై పని ఒత్తిడి పెంచారన్నారు. ఈ క్రమంలోనే మధ్యాహ్న భోజనం కూడా తినకుండానే రేషన్ సరుకుల పంపిణీ కోసం ఫింగర్ వేయడానికి వెళ్లిన ఈశ్వరయ్య ఇలా మృత్యువాత పడటం విచారకరమన్నారు. వీఆర్ఓ ఈశ్వరయ్య కుటుంబ సభ్యులకు అన్ని రకాల బెనిఫిట్స్ అందించి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

పారదర్శకంగా పోలీసుల బదిలీలు



పోలీసు సిబ్బందికి బదిలీ ఉత్తర్వులు ఇస్తున్న జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప అర్బన్ : పారదర్శకత, నిబంధనలే ప్రామాణికంగా తీసుకుని పోలీస్ సిబ్బంది సీనియారిటీ ఆధారంగా వారు కోరుకున్న చోటికే జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్ బదిలీ చేశారు. గురువారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ముగ్గురు ఏఎస్ఐలు, 29 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 104 మంది కానిస్టేబుళ్లకు జిల్లా ఎస్పీ కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించి బదిలీ చేశారు. బదిలీల ప్రక్రియ పారదర్శకంగా జరగడంతో సిబ్బంది సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్.పి (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎన్.సుధాకర్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ దారెడ్డి భాస్కర్ రెడ్డి, డీటీసీ ఇన్‌స్పెక్టర్ వినయ్ కుమార్ రెడ్డి, జిల్లా పోలీస్ కార్యాలయం ఏఓ జ్యోతి, సూపరింటెండెంట్‌లు, సిబ్బంది, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జర్నలిస్టు క్రికెట్ టోర్నమెంట్ విజేత కడప

కడప వైఎస్ఆర్ సర్కిల్ : గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి జర్నలిస్టు క్రికెట్ టోర్నమెంట్‌లో వైఎస్సార్ కడప జిల్లా జట్టు విజయం సాధించినట్లు కడప జర్నలిస్టు టీం మేనేజర్ భూమిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. గుంటూరు పోలీసు గ్రౌండ్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో చిత్తూరు జట్టుపై భారీ విజయం సాధించి కప్పును కైవసం చేసుకుందన్నారు. నెల్లూరు, విజయనగరం, శ్రీకాకుళం, చిత్తూరు జట్ల పైన విజయం సాధించారన్నారు. కడప టీం సభ్యుడు పఠాన్ సెంచరీ సాధించడంతో పాటు మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచారు. ఈ విజయం సాధించడం పట్ల కెప్టెన్ రామసుబ్బారెడ్డి , రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు సురేంద్ర యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి విజేతలకు అభినందనలు తెలిపారు.



రాష్ట్ర స్థాయి జర్నలిస్టు క్రికెట్ టోర్నమెంట్ విజేతగా నిలిచిన వైఎస్సార్ కడప జిల్లా జట్టు

దౌర్జన్యాలకు పాల్పడితే సహించేది లేదు

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.నరేన్‌రెడ్డి



తిప్పిరెడ్డిపల్లెలో రైతు సర్దార్ హుస్సేన్ రేకుల షెడ్డు తొలగించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నరేన్ రెడ్డి

పెండ్లిమర్రి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను ఇబ్బందులకు గురిచేయడం, దాడులకు పాల్పడటం లాంటి చర్యలకు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పి.నరేన్ రామాంజులరెడ్డి మండిపడ్డారు. ఇలాంటి దౌర్జన్యాలను సహించేంది లేదని హెచ్చరించారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న అధికారుల తీరుపై మండిపడ్డారు. పెండ్లిమర్రి మండలం తిప్పిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ముస్లిం మైనార్టీ రైతు సర్దార్ హుస్సేన్ భూమిలో కంచె, రేకుల షెడ్ తొలగించిన ప్రాంతాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సర్దార్ హుస్సేన్‌కు చెందిన పట్టా భూమిలో, భూమి పక్కన తమ ఆధీనంలో ఉన్న స్థలంలో రేకులషెడ్డు, కంచె ఏర్పాటు చేసుకున్నాడన్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు రైతుకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా రెవెన్యూ, పోలీసు అధికారులు దౌర్జన్యంగా జేసీబీ యంత్రంతో తొలగించడం దారుణమన్నారు. ఇది ముమ్మాటికి అధికార దుర్వినియోగమన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ అనురాధకు ఫోన్ చేసి నోటీసులు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారని అడిగితే తాను అక్కడికి వచ్చి పరిశీలిస్తానని ఆమె చెబుతున్నారన్నారు. ఇప్పుడు పరిశీలిస్తే ఏమి లాభమన్నారు. రైతుకు దాదాపు రూ.2 లక్షలు నష్టం జరిగిందని, దీనికి ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. రైతుకు అధికారులు న్యాయం చేయకపోతే వైఎస్సార్‌సీపీ తరపున ఎంతటి పోరాటానికైనా సిద్ధమన్నారు. కూటమి నేతల ఆగడాలు, భూకబ్జాల విషయంలో జాయింట్ కలెక్టర్, కలెక్టర్ జోక్యం చేసుకొని అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ మండల ఉపాధ్యక్షుడు నాగమల్లారెడ్డి, పంచాయతీరాజ్ జాయింట్ సెక్రటరీ రాజారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బారెడ్డి, శ్రీనువాసులురెడ్డి పాల్గొన్నారు.

చిత్తూరు,అనంతపురం జట్ల విజయ ఢంకా



లోహిత్ లక్ష్మీనారాయణ, చిత్తూరు (112 పరుగులు)



మహేంద్ర, అనంతపురం (67 పరుగులు)



బాలాజీ, చిత్తూరు (నాలుగు వికెట్లు)



మల్లికార్జున, అనంతపురం (నాలుగు వికెట్లు)

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్ జోన్ అండర్ -23 వన్డే క్రికెట్ టోర్నీ చిత్తూరు, అనంతపురం జట్లు విజయ ఢంకా మోగించాయి. గురువారం వైయస్ రాజారెడ్డి ఏసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టుపై చిత్తూరు జట్టు 94 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 50.0 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 296 పరుగులు చేసింది. ఆ జట్టులోని లోహిత్ లక్ష్మీనారాయణ అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించాడు. 102 బంతులను ఎదుర్కొని 10 బౌండరీలు, 3 సిక్సర్ల సహాయంతో 112 పరుగులు (సెంచరీ) చేశాడు. నికిత్ గౌడ్ 60 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని మాధవ్ 3 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 297 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన నెల్లూరు జట్టు 42.2 ఓవర్లలో 202 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయి ఓటమి చవిచూసింది. ఆ జట్టులోని మన్విత్ రెడ్డి 52, అర్జున్ 37 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని బాలాజీ 4, రెడ్డి ప్రకాష్ 3 ముఖేష్ 2 వికెట్లు తీసుకున్నారు.

కేఎస్ఆర్ఎం మైదానంలో...

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన వేరొక మ్యాచ్‌లో కర్నూలు జట్టుపై 3 వికెట్ల తేడాతో అనంతపురం జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 38.1 ఓవర్లలో 196 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని నయీముల్లా 59, కనిష్ 51 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని మల్లికార్జున 4, దీపక్ 2, షేక్ కామిల్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 197 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 34.4 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసి 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆ జట్టులోని మహేంద్ర రెడ్డి 67, అర్జున్ టెండూల్కర్ 40 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని కనిష్ 3, సాబ్జాన్ బాషా 2 వికెట్లు తీసుకున్నారు.

సతీష్ రెడ్డిని కలిసిన మాజీ డిప్యూటీ సీఎం



సతీష్‌రెడ్డితో మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా తదితరులు

వేంపల్లె : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ కుమార్ రెడ్డిని గురువారం మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా కలిశారు. వేంపల్లెలోని తన స్వగృహంలో ఉన్న సతీష్ రెడ్డితో ఆయన సుదీర్ఘంగా చర్చించారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి గట్టిగా తీసుకుపోయేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం తమ బంధువుల వివాహ ఆహ్వాన పత్రికను సతీష్‌రెడ్డికి అందజేశారు. సతీష్ రెడ్డిని కలిసిన వారిలో కడప కార్పొరేటర్లు మహమ్మద్ షఫీ, అజ్మతుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ తోట కృష్ణ, వేంపల్లె మండల వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు మునీర్, షేక్షావలి, మాజీ ఉప సర్పంచ్ మునీర్, బాబా షరీఫ్, షామీర్ ఉన్నారు.

ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని

కడప అర్బన్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కడప కోర్టు ఆవరణంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించాలని కోరారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి, ఇన్‌చార్జి నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి కే.సత్య కుమారి, ఏడవ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.రమేష్ కుమార్, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్.బాబా ఫక్రుద్దీన్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.భార్గవి, మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ జి.విజయలక్ష్మి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీదేవి, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ ఆత్మహత్య



హరిప్రసాద్ (ఫైల్)

మదనపల్లె రూరల్ : అనారోగ్య కారణాలతో ఎలక్ట్రీషియన్ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం మదనపల్లెలో వెలుగు చూసింది. మండలంలోని కొత్తపల్లి పంచాయతీ కొత్త ఇండ్లుకు చెందిన హరి ప్రసాద్ (32) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. అతనికి భార్య నాగవేణి రెండు సంవత్సరాల వయసున్న కుమారుడు ఉన్నారు. అయితే గత కొంతకాలంగా హరిప్రసాద్ కిడ్నీ, లివర్ సంబంధిత వ్యాధులతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాడు. వ్యాధులను బాగు చేసుకునేందుకు పలు ఆసుపత్రుల చుట్టూ తిరిగాడు. అయినా పరిస్థితి మెరుగు పడకపోగా నానాటికి క్షీణిస్తూ ఉండడంతో మానసికంగా కుంగిపోయాడు. వారం రోజుల క్రితం భార్య నాగవేణి కుమారుడిని, ఆమె పుట్టిల్లు అయిన చౌడేపల్లి మండలం చదళ్ల పంచా యతీ బోయపల్లెలో విడిచిపెట్టి వచ్చాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తాలూకా పోలీసులకు సమాచారం అందించడంతో, వారు సంఘటన స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కేసు విచారణ చేస్తున్నారు.

కుటుంబ సమస్యలతో..



శంకర (ఫైల్)

మదనపల్లె రూరల్ : కుటుంబ సమస్యలు, భార్య అనారోగ్యం, అప్పులు తదితర కారణాలతో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం ములకలచెరువు మండలంలో వెలుగు చూసింది. మండలంలోని మద్దినాయన పల్లె పంచాయతీ నాయనవారిపల్లెకు చెందిన పెద్ద రెడ్డప్ప కుమారుడు శంకర (39) వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. అతని భార్య రాధమ్మ స్థానికంగా అంగన్వాడీ టీచర్‌గా పని చేస్తూ ఉంది. ఆరు నెలల క్రితం ప్రమాదం కారణంగా రాధమ్మకు కాలు విరిగింది. ఆమెకు చికిత్స చేయించడానికి పలువురి వద్ద శంకర, దాదాపు రూ 10 లక్షలు అప్పులు చేశాడు. ఇటీవల కొంతకాలంగా రుణ దాతల నుంచి ఒత్తిడి అధికం కావడం. దీనికి తోడు కుటుంబ సమస్యలతో ఇంట్లో గొడవలు జరుగుతుండడం, తదితర కారణాలతో మనస్తాపం చెంది, బుధవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు కిందికి దించి పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. దీంతో ములకలచెరువు పోలీసులకు సమాచారం అందించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ములకలచెరువు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

జీవితంపై విరక్తితో..

లింగాల : మండలంలోని తాతిరెడ్డిపల్లె గ్రామంలో గురువారం గవిరెడ్డి శివారెడ్డి (60) అనే వ్యక్తి తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతను చాలా కాలం నుంచి దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఆలనా పాలనా చూసేందుకు భార్య లేకపోవడంతోపాటు గతంలోనే కుమారుడు మృతి చెందాడు. దీంతో ఆయన జీవితంపై విరక్తి చెంది తన పాత ఇంట్లో దంతెలకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు లింగాల పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

త్యాగమయ జీవితం బక్రీద్ సందేశం

రేపు ఈద్-ఉల్-జుహా (బక్రీద్)

ఖుర్బానీ జంతువుల రక్త మాంసాలు అల్లాహ్‌కు చేరవు. కేవలం మీ భయభక్తులే భయ భక్తులు, విశ్వాసం, సమర్పణ గుణాలే చేరుతాయి

- దివ్య ఖురాన్



కడప కల్చరల్ : సృష్టి ఎంతో అద్భుతమైనది.. .సకల చరాచరాలతో నిండి ఉన్న దీన్ని ఏకేశ్వరుడైన అల్లాహ్ సృష్టించాడు. ఆయన ప్రసాదించిన ఈ జీవితాన్ని ఆయన కోసం త్యాగం చేసేందుకు వెనుకాడకూడదని సందేశాన్నిచ్చే పండుగ బక్రీద్. ఈ పండుగ ప్రవక్త ఇబ్రహీం త్యాగనిరతి, సహనశీలత, రుజు వర్తనలను తెలుపుతుంది. మానవాళికి మార్గదర్శకత్వం వహించడానికి దైవం పక్షాన అవతరించిన ప్రవక్తల్లో ఇబ్రహీం ఒకరు. ఐదు వేల సంవత్సరాల క్రితం జన్మించిన ఆయన ×దేవుడే సకల చరాచర సృష్టికి కారకుడని, ఆయన పట్ల భక్తి, శ్రద్ధలు ప్రకటించడం ద్వారా ముక్తిని పొందవచ్చని జాతికి పిలుపునిచ్చారు. ఈ పండుగలోని ముఖ్యాంశాలు పాఠకుల కోసం..

సమర్పణలో సంతృప్తి

ఇస్లాంలో రంజాన్‌కు ఎంతటి ప్రాధాన్యత ఉందో, బక్రీద్‌కు కూడా అంతే ప్రాధాన్యత ఉంది. శనివారం ఈ పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోనున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు లేని ప్రతి వ్యక్తి ఖుర్బానీ ఇవ్వడం ఈ పండుగ సంప్రదాయం . ఖుర్బానీ ద్వారా వచ్చిన మాంసాన్ని మూడు భాగాలు చేసి ఒక వంతు పేదలకు, రెండో భాగాన్ని బంధుమిత్రులకు ఇస్తారు. మరో భాగాన్ని తమ కోసం వాడుకుంటారు.

త్యాగమంటే ఇదే!

బక్రీద్ పండుగ ప్రవక్త ఇబ్రహీం త్యాగనిరతికి ప్రతీకగా పెద్దలు పేర్కొంటారు. దేవుడొక్కడే అన్న ఆయన వాదాన్ని వ్యతిరేకించిన వారు ఆయనపై కక్ష గట్టి ఆయనను శారీరక, మానసిక హింసలు పెట్టి, తుద ముట్టించేందుకు ఎన్నో యత్నాలు చేశారు. వృద్ధాప్యం వచ్చినా సంతానం లేకపోవడం ప్రవక్త ఇబ్రహీంను వేధించేది. మంచి సంతానాన్ని ప్రసాదించమని ఆయన నిరంతరం ఏకేశ్వరుడిని ప్రార్థించేవారు. 86 ఏళ్ల వయసులో ఆయనకు దైవం ఒక కుమారుడిని ఇచ్చాడు. ఆనందంలో ఓలలాడుతున్న సమయంలో దైవం ఇబ్రహీం భక్తిని పరీక్షించదలిచారు. నీ ప్రియ పుత్రుడిని మానవ మాత్రులు సంచరించని ఎడారిలో వదిలేయమని ఆజ్ఞాపించారు. పుత్రునికంటే దైవం ఆదేశమే గొప్పదన్న విశ్వాసంతో ఇబ్రహీం తన సతీమణి బీబీ హాజిరాను, కుమారుడు ఇస్మాయిల్‌ను ఎడారిలో వదిలి పెట్టారు. తల్లీ బిడ్డ ఆకలి దప్పులతో అలమటించారు. అక్కడి సఫా కొండల మధ్య నీళ్ల కోసం వెదికారు. ఇస్మాయిల్ దాహంతో గిలగిల్లాడుతున్నప్పుడు అతడి కాలి మడమల మధ్య ఇసుకలో గుంత ఏర్పడి, ఆ ఎడారిలో నీటి ఊట ఏర్పడుతుంది. అదే సెలయేటిగా మారింది. ఆ నీటినే పవిత్రమైన 'జమ్‌జమ్' పానీ అంటారు. హజ్‌కు వెళ్లిన యాత్రికులు ఆ పవిత్ర 'జమ్ జమ్' జలాన్ని సేవించి తమ బంధు మిత్రులు, కుటుంబ సభ్యుల కోసం కూడా తీసుకెళతారు.

మరొక పరీక్ష

ప్రవక్త ఇబ్రహీంకు దైవం మరొక కఠిన పరీక్ష పెట్టారు. కలలో అందిన సూచన మేరకు ఆయన తన కుమారుడిని బలి ఇచ్చేందుకు సిద్ధమవుతారు. కుమారుడు కూడా దైవాజ్ఞను శిరసావహించేందుకు అంగీకరిస్తాడు. తండ్రి ఇబ్రహీం కుమారుడిని 'జుబాహ్' చేశాడు. తీరా చూస్తే కుమారుడికి బదులు అక్కడ ఒక గొర్రె జుబాహ్ చేయబడి ఉంటుంది. దైవం పట్ల ప్రవక్త ఇబ్రహీంకు గల అచంచల భక్తి, విశ్వాసాలకు, త్యాగనిరతికి ప్రతీకగా ముస్లింలు యేటా 'ఈద్-ఉల్- జుహా' పండుగను నిర్వహించుకుంటున్నారు.